# కొండవీటి కొనలు

శ్రీ చిల్లా వెంకటకృష్ణమూర్తి

ఆంధ్రదేశము, తెలుఁగుభాష అను పదములను స్మరించినతోడనే దానిలో ఏదో మహోత్తమమైన పవిత్రత, నిగూఢమైన మహిమగలదను భావము ఆంధ్రుడయిన వానికి గోచరించకమానదు. "ధనం మూల మిదం జగత్," అనునయోక్తిచేత అర్థం చేతనయితేనేమి, మానవుని విశేష శక్తి వలననయితేనేమి పూర్వాంధ్రులు తెలుఁగుతల్లికి చేసినసేవ మిక్కిలి కొనియాడదగియున్నది. అందుకు నిదర్శనముగా ఆంధ్రుల కీర్తిని వేనోళ్ళచాటు హంపీశిథిలములు అజంతాగుహలు, కొండవీడు శిథిలములు మోటుపల్లి ఓడరేవు మొదలగునవి. ఇవి పూర్వాంధ్రమున అఖండ ఐశ్వర్యములతో వెలిగి తుదకు ఈనాడు వెలలేని, ప్రతిభలతో ఘుమ, ఘుమలాడుచు, తెలుఁగువారికీర్తిని వేనోళ్ళచాటుచు, ఆంధ్రుల పిత్రార్జితమున్నట్లు మచ్చుముక్కలై నిలచినవి. కావుననే ఈనాడు పూర్వాంధ్రుల కీర్తికాంతులలో భారతదేశము పలుదేశములకన్న మన్నికకు మిన్నగా యుండుటయే అందుకు ప్రత్యక్ష నిదర్శనము.

పూర్వాంధ్రములో కొండవీటి రాజ్యము అను ఱుల రాజ్యమును తలదన్నునట్లు తేజోవంతముగా వెలిగిపోయిన రాజ్యములలో నొకటి. దానిపాలకులు పెక్కుమంది అయినప్పటికి, రెడ్డి రాజుల కాలములో దానికి చరమదశ సంప్రాప్తమయినది. "వెలుగుట విఱుగుట కొఱకే," అనునయోక్తిచేత కొండవీడు చరమదశ నొందుటకు ప్రబలమయిన కారణ మొకటున్నది.

పూర్వము కొండవీడు రాజ్యమును రెడ్డిరాజులు పరిపాలించుకాలమున ఒక బ్రాహ్మణుడు తపస్సు చేసుకొనుటకై పలుచోట్ల తిరిగి, తిరిగి చివరకు కొండవీటి రాజ్యమందు అనువగు ప్రదేశమును చూచుకొని స్థావరమేర్పరుచుకొనెను. ఆ బ్రాహ్మణునకు ఒక ద్రవముతోగూడిన కమండల మొకటిగలదు, దానిని ప్రాణ మొకెత్తుగా కాపాడుచుండెను. తపస్సు చేసుకొను స్థలమునకు సమీపమున ఒక వృక్ష శాఖకు దానిని తగిలించి, నితరుల చేజిక్కదని మనస్సు స్థిమితపఱచుకొని నిశ్చింతగా తపమాచరించుచుండెను. దైవ దుర్విపాకమున కమండలములోని ద్రవము క్రిందనున్న నాగలిపైపడెను. రోజులు గడువ ఆ బాపడు తపమాచరించుచుండెను.

కొంతకాలమునకు తొలకరివానలు భూమాతను శాంతి పరచుచున్నవి. రైతులు ఏరువాక సాగించ బలిసిన బసవయ్యలతో భూమిని దున్నుటకు బయలుదేరారు. రైతులు వచ్చి నాగలిని చూచుసరికి సూర్య కిరణములలో ఆ నాగలి బంగారు మెరుపులతో మెఱయుచుండెను. ఆనందంతో చుట్టు కలయచూడసాగిరి. కొద్ది దూరములో ఒక బ్రాహ్మణుడు తపమాచరించుట చూచిరి. వృక్ష శాఖకు తగిలించిన కమండలమును చూచిరి. ఈ కమండలము ఆబ్రాహ్మణుడిదని, కమండలములోని ద్రవము కొయ్యను బంగారము చేయునది అని నిశ్చయించి తమ పాలకుడగు రెడ్డిరాజు కెఱింగించిరి. ఆ రాజు పేరాశగలవాడై తన సేవకులచేత ఆ కమండలమును తెప్పించి, రాజ్యములో కొయ్య లన్నింటిని బంగారముగా మార్పించెను.

కాలము గడచిన తరువాత ఆ బ్రాహ్మణుడు చూచుసరికి కమండలము లేకుండెను. సంగతంతా జ్ఞానదృష్టిచేత తెలిసికొని ప్రళయ కాలపు రుద్రునివలె నిప్పులు గ్రక్కెను. చివరకు ఎట్లైన రెడ్డిరాజులను నాశనము చేయవలయునని ప్రతిజ్ఞబూనెను. తరువాత పాశ్చాత్యుల స్నేహము సంపాదించి ఒక పన్నుగడ పన్నెను. కొండవీట రాజ్యమందు ఒక

చీకటి గృహమందు ఒక కత్తుల బావిని తనమహిమచేత నిర్మించెను. ఆగృహమునందున్న కత్తుల బావిగల గది పాణిద్వారమునకు పోవుగనిలో నుండెను. ఒకమూల ఒకప్రమిద గ్రుడ్డివెలుగు నిచ్చుచుండెను. తరువాత ఆ బ్రాహ్మణుడు రెడ్డిరాజులందరిని విందుకు ఆహ్వానించెను! - అందుకు ఒక నియమము పెట్టెను. విందుచేసిన పిమ్మట పాణి ద్వారముగుండా పోవలయునని చెప్పెను. ఏదో ఛాందస బ్రాహ్మణుడని విందు చేసిన పిమ్మట ఒక్కొక్క రాజు పోవటము-బావిలో పడటము జరుగుచున్నది ఆయేలికగాడు అమ్మయ్యో! అను శబ్దము చేసినను ఆ శబము బావిలోనే నింకిపోవుచుండెను. చివరకు ఒక రాజు పోయిన రాజులందరు రాకపోవుటచూచి విందులో నేదో మోసమున్నదని తెలిసికొని పలాయనము చిత్తగించెను. తరువాత ఆద్విజుడు యింత మందిని చంపి జీవించుట తగదని తానుగూడా ఆ బావిలో పడి మరణించెను. ఇట్లుకొండవీటి రాజ్యము చరమదశ సంప్రాప్తమయినది.



నాగార్జున ప్రాంత ఆటవిక కాంతలు

Photo by : Sri. M. G. Menon

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3-0-0

అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.